# శ్రీ సత్యసాయి బాలవికాస్ మాసపత్రిక

సంపుటి 1 ఉగాది ప్రత్యేక సంచిక సంచిక 4

*ఈ సంచికలో . . . . .*


| క్ర.సం. | విషయాలు | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | సాయిమాట | 3 |
| 2. | సూర్యాష్టకం | 4 |
| 3. | గౌరీ ప్రార్థన | 5 |
| 4. | మన పండుగలు - ఉగాది | 6 |
| 5. | చేదు పచ్చడి ప్రసాదమా! .... | 7 |
| 6. | పండుగలో పరమార్థం-ఉగాది | 7 |
| 7. | ఒక శ్లోకం-ఒక రామాయణం ఆచార్య. జి.వి. సుబ్రహ్మణ్యం | 8 |
| 8. | వాక్య విభూతి - | 10 |
| 9. | మంచినాలుక - చెడునాలుక | 10 |
| 10. | పద్యసూక్తి ..... | 12 |
| 11. | ఆచరణలేని ప్రచారము వ్యర్థం ..... కథ | 12 |
| 12. | ఆటలు-పాటలు మెదడుకు మేత.... రామనామతారకం | 13 |
| 13. | ఆటలు-పాటలు ..... సీతారామ ఆట ..... | 14 |
| 14. | మనచారిత్రక పురుషులు గాంధీ ......... | 15 |
| 15. | బొమ్మల కథ ..... | 16 |
| 16. | వసంతఋతువు వచ్చింది | 18 |
| 17. | "మీ విలువ ఎంత" క్విజ్ | 19 |
| 18. | స్వామికథ.. సీరియల్ | 20 |
| 19. | పుట్టిన రోజుపండుగ గేయం | 21 |
| 20. | స్వామి పుట్టినరోజు-బొమ్మ | 21 |
| 21. | నీతి కథలు ... (సీరియల్) | 22 |
| 22. | భగవద్గీత ...... "మనకెందుకంట" ! | 24 |
| 23. | తృప్తి (కథ) | 25 |
| 24. | సత్యవ్రతుడు ... (కథ) | 26 |
| 25. | పల్లెసీమలు-పిల్లగాలులు | 28 |
| 26. | స్వామితో నా అనుభవం శ్రీమతి లలితమ్మగారు | 30 |
| 27. | మీ పేజి సాయి దర్శనం ... ఇ. పద్మావతి | 31 |
| 28. | పేరులోనే సందేశం శ్రీమతి స్వయంప్రభ | 32 |

# బాలల వికాసమే మన ధ్యేయం

భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి ఆశీస్సులతో పాఠకుల ప్రోత్సాహంతో ఈ ఉగాది ప్రత్యేక సంచిక వెలువడుతోంది. మీ ఆదరణ మాకు ప్రేరణ. మీ అభిమానం మాకు ఆనందం. బాలల వికాసమే మన ధ్యేయం. ఈ నెల ఉగాది, శ్రీరామనవమి సందర్భంగా ఈ సంచిక కొత్త అందాలు దిద్దుకుంది.

ఈ సంచికలో కొన్ని కొత్త శీర్షికలు ప్రారంభిస్తున్నాం. ఆటలు-పాటలు, మెదడుకు మేత, పల్లెసీమలు-పిల్లగాలులు లాంటివి కొత్త మెరుపులు. పిల్లల భావాలు, కళలు, అన్నింటి ప్రదర్శనకూ ఇది రంగస్థలం. పిల్లల నేర్పుకు, నైపుణ్యానికి ఈ పత్రిక వేదిక. పిల్లలు నేర్చినవి-నేర్వవలసినవి ఈరెండూ ఈ పత్రికకు రెండుకళ్ళు.

పిల్లలు నేర్చినవి ప్రదర్శిద్దాం, నేర్వవలసినవి బోధిద్దాం, విందాం, వినిపిద్దాం, చూద్దాం, చూపిద్దాం.

లోకంలో సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు అడుగంటుతున్నాయి. మరుగున పడుతున్న ఈ విలువలను పిల్లల మనో వీధులలోకి తేవడం మనవిధి. ఈ సంచికనుంచి ఈ ప్రయత్నం చేస్తున్నాం. నీతులు బోధిస్తే, నీతి శతకాలు వల్లిస్తే, సూక్తి సుధలు వినిపిస్తే పిల్లలకు విసుగు. అందుకే కథలతో, కబుర్లతో అంతర్లీనంగా ఈ విలువలను చెప్తున్నాం. వాటిని పంచదార గుళికలు చేయడమే మా ప్రయత్నం. పంచదార పూత కథ అయితే కనిపించని దివ్యౌషధం దానిలోని విలువ. ఈ విలువలు వెలికితీసి వివరించడంలో గురువులు, తల్లిదండ్రులు, పెద్దలు పిల్లలకు సహాయం చేయాలి.

**విలువైన కథలు, కబుర్లు సిద్ధం చేయడం మా వంతు,**
**వివరించి వినిపించడం పెద్దలవంతు,**
**బుద్ధిగా వినడం పిల్లలవంతు.**
**లోకాః సమస్తాః సుఖినోభవంతు !!**

సాయిమాట

# రామ నామ మహిమ

నారదుడు "నారాయణ, నారాయణ" అంటూ విష్ణునామం జపిస్తూ లోకాలన్నీ తిరుగు తుంటాడు. ఒకరోజు విష్ణువు దగ్గరకు వెళ్ళి "స్వామీ ! నాకు రామనామము యొక్క అర్థం తెలుసుకోవాలని ఉంది" అన్నాడు. "అయ్యో ! నారదా ! నీకింతవరకు రామనామము అర్థం తెలియదా? అయితే అదిగో, ఆ చెట్టుపైన ఉన్న చిలుకను అడుగు, అది చెబుతుంది" అన్నాడు నారాయణుడు.

నారదుడు చిలుక దగ్గరకు వెళ్ళి "ఓ చిలుకా ! రామా అంటే అర్థం నీకు తెలుసా?" అని అడుగుతుండగానే చిలుక చెట్టుపైనుండి క్రిందపడి ప్రాణం వదిలింది. ఇదేమిటి? అనుకుని నారదుడు మళ్ళీ నారాయణునివద్దకు వెళ్ళాడు. "స్వామీ ! మీరు చెప్పినట్లు నేను చిలుకను అడుగగానే అది చనిపోయింది. దాని చావుకు నేను కారణమేమో అని పాపం చేసినట్లు బాధగా ఉంది" అన్నాడు నారదుడు.

విష్ణువు "నారదా ! రామనామం అర్థం తెలుసుకోవాలంటే చాలా పట్టుదలకావాలి. ఇప్పుడే ఒక బ్రాహ్మణుని ఇంట్లో ఆవుకు దూడపుట్టింది. పోయి ఆ దూడను అడుగు చెబుతుంది" అన్నాడు.

పక్షికి జరిగినట్లు ఆవుదూడకు జరిగితే యజమాని తనను పట్టుకుని కొడతాడో ఏమో అని భయపడుతూనే నారదుడు వెళ్ళాడు. ఆ బ్రాహ్మణుడు నారదుడిని చూసి మర్యాదచేసి కూర్చోబెట్టి పాలు తెస్తానని లోపలకు వెళ్ళాడు. ఇదే మంచి సమయం అని నారదుడు దూడ దగ్గరకు వెళ్ళి "ఓ దూడా ! రామా అంటే అర్థం ఏమిటి?" అని అడిగాడు. వెంటనే ఆ దూడ ప్రాణం విడిచింది. ఇంటి యజమాని వచ్చేలోపల నారదుడు చల్లగా జారుకున్నాడు.

మళ్ళీ నారాయణుని దగ్గరకు వెళ్ళి "స్వామీ ! దూడకు కూడా చిలుక గతే పట్టింది. రాముడి అర్థం ఇంతేనా?" అని అడిగాడు. "నారదా ! కాస్త ఓపికపట్టు ఇప్పుడే ఫలానా మహారాజుకు లేక లేక ఒక కుమారుడు పుట్టాడు. ఆ పిల్లవాడిని అడుగు" అన్నాడు నారాయణుడు.

"స్వామీ ! ఆ పక్షికి, ఆవుదూడకు ఎవ్వరూ దిక్కులేరు కనుక సరిపోయింది. నన్ను పట్టుకుని అడిగేవాళ్ళు లేకపోయారు. ఇప్పుడు ఆ రాజకుమారుడు మరణిస్తే నన్ను అక్కడే బంధిస్తారు. రాజుగారు తల తీయిస్తాడు. నాకు నీ దర్శనం కూడా లేకుండా పోతుంది" అంటూ "సరే ! ఏమైనా జరగనీ పట్టుదల కావాలన్నావుగదా, నీదే భారం" అనుకుంటూ వెళ్ళాడు నారదుడు.

నారదుడిని చూసి మహారాజు ఎంతో సంతోషంతో "రండి స్వామీ ! రండి, రండి. మంచి సమయానికే వచ్చారు. ఇప్పుడే నాకు ఒక కుమారుడు పుట్టాడు. వాడిని ఆశీర్వదించండి" అన్నాడు.

నారదుడు లోపల భయపడుతూనే, పైకి నవ్వుతూ లోపలికి వెళ్ళాడు. "నాయనా ! రాజకుమారా ! శతమానం భవతి"... అంటూ వేదమంత్రాలను చదువుతూ రాజుకు తెలియకుండా మంత్రాలలో కలిసిపోయేటట్లు సంస్కృతంలోనే "రామా అంటే అర్థం ఏమిటి?" అని అడిగాడు. భయంగా చూస్తున్నాడు.

రాజకుమారుడు ఫక్కున నవ్వాడు. నారదుడు కూడా నవ్వాడు. (బ్రతికిపోయానని) రాజకుమారుడు మరణించలేదుకదా ! పైగా నవ్వాడు కూడా. ఇది తన అదృష్టమనుకుని నారదుడు ఊపిరి పీల్చుకున్నాడు.

అప్పుడు రాజకుమారుడు "ఓ నారదా ! 64 విద్యలు నేర్చిన మీకే రామనామం అర్థం తెలియదా? నేను చెబుతాను వినండి. నేను చెట్టుపైన చిలకగా ఉన్నప్పుడు మీరు వచ్చి 'రామనామం' అర్థం ఏమిటని అడిగారు. ఒక్కసారి రామనామం వినేటప్పటికి నా జన్మధన్యమయింది. వెంటనే ఆ దేహం వదిలి ఒక బ్రాహ్మణుని ఇంట్లో ఆవుదూడగా పుట్టాను. మీరు అక్కడకు కూడా వచ్చి అదే ప్రశ్న వేశారు. రెండవసారి రామనామం వినేసరికి ఆ జన్మను కూడా విడిచి ఇప్పుడు రాజకుమారునిగా పుట్టాను" అన్నాడు.

చూశారా ! రామనామం వినడంలో ఎంత మహిమ ఉన్నదో ! పక్షి ఎక్కడ ? ఆవుదూడ ఎక్కడ ? రాజకుమారుడెక్కడ ? కేవలం ఒక్కసారి రామనామం వినడంవల్ల ఇంతటి మార్పు జరిగితే నామం స్మరించడంవల్ల, ఎప్పుడూ జపించడంవల్ల ఇంకెంత మార్పు జరుగుతుందో కదా!

## సూర్యాష్టకం :-

**సప్తాశ్వ రథమారూఢం ప్రచండం కశ్యపాత్మజం ।**
**శ్వేత పద్మ ధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహం ॥**

సూర్యుని రథానికి ఏడు గుఱ్ఱాలు ఉంటాయి. ఆ రథాన్ని నడిపే సారథి అనూరుడు. సూర్యుడు కశ్వప మహాముని కుమారుడు.

భావం :- ఏడు గుఱ్ఱాల రథము ఎక్కి, తెల్లని పద్మము ధరించి, దేదీప్యమానం అయిన తేజస్సుతో ప్రకాశించే, కశ్యపముని కుమారా ! సూర్యదేవా ! నీకు నమస్కారము.

## గౌరీ ప్రార్థన :

సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థ సాధికే
శరణ్యే త్రయంబకే గౌరీ నారాయణీ నమోస్తుతే ॥

**భావం :-** సకల శుభములకు మూలమైన పార్వతీ ! కోరికలన్నీ తీర్చు తల్లీ ! అందరికీ శరణము నిచ్చు మాతా ! మూడు కన్నులు కల, శివుని అర్థాంగి అయిన గౌరీ ! నారాయణుని సోదరీ ! నీకు నమస్కారము.

**విశేషాలు :-** గౌరి మంగళము, శుభము కలిగిస్తుంది. గౌరి, పార్వతి, దుర్గ, కాళి ఇలా అనేక రూపాలలో ఈమెను పూజిస్తారు. ఈమె శివుడి భార్య. శివుడి శరీరంలో సగం భాగంగా ఈమె ఉంటుంది. అందుకే శివుడికి 'అర్ధనారీశ్వరుడు' అని పేరు వచ్చింది. (అర్ధ = సగము, నారి = స్త్రీ, ఈశ్వరుడు = శివుడు). ఈమె శక్తి స్వరూపం. శక్తి లేనిదే శివుడు కదలను కూడా కదలలేడు. చంద్రుడు లేకుండా వెన్నెల ఉంటుందా? వెన్నెల లేకుండా చంద్రుడు ఉంటాడా? చంద్రుడు వెన్నెల ఎప్పుడూ కలిసే ఉంటాయి. అలాగే శక్తి లేకుండా శివుడు లేడు. శివుడు లేకుండా శక్తి లేదు. ఈ జగత్తు అంతా శివశక్తి స్వరూపమే. పాపాలను పోగొట్టే తల్లి పార్వతి. ఈమెను జగజ్జనని, లోకమాత అని భావిస్తారు. ఆదిశక్తిని అమ్మగా అర్చించడం భారతీయ సంప్రదాయం.

ఈ మూలశక్తి ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అని మూడు రూపాలుగా ఉంటుంది. ఉదాహరణకు పరబ్రహ్మ ఈ లోకాన్ని సృష్టించాలి అని అనుకోవడం, అంటే సంకల్పించడం 'ఇచ్ఛాశక్తి'. ఆ సంకల్పాన్ని ఎలా జరపాలి. సృష్టిని ఎలా చేయాలి అని ఆలోచించి నిర్ణయించడం 'జ్ఞానశక్తి' దానిని జరిపించడం అంటే సృష్టించడం 'క్రియాశక్తి' కాబట్టి సంకల్పం ఇచ్ఛాశక్తి, ఆలోచన జ్ఞానశక్తి, అమలు చేయడం క్రియాశక్తి.

మాటయే జగత్తుకు సంపత్తి,  మాటయే పవిత్రమైన మిత్రబాంధవ్యం
మాటయే బంధుప్రీతికి ప్రధానమైన అర్థం
మాటయే మరణానికి మార్గం,  మాటయే మహత్తరమైన శక్తి స్వరూపిణి
మాటలను తెలిసి పలకటం అత్యవసరం.

బాబా.

మన పండుగలు :

# ఉగాది

ఉగాదినే సంవత్సరాది అని కూడా పిలుస్తారు. తెలుగువాళ్లకు ప్రతి సంవత్సరం చైత్రమాసంతో ప్రారంభం అవుతుంది. యుగమునకు ఆది (మొదలు) అనే అర్థం కల 'యుగాది' అనే పదం నుంచి ఉగాది అనే పేరు వచ్చింది. కృతయుగము వైశాఖమాసముతో, త్రేతాయుగము మాఘమాసముతో, ద్వాపరయుగము మార్గశిరమాసముతో, కలియుగము చైత్రమాసముతో ప్రారంభమైనాయి. కనుకనే దానిని యుగాది అన్నారు. మనము చైత్ర శుద్ధ పాడ్యమి రోజు ఉగాది పండుగ చేసుకుంటాము.

పండగ రోజు ఇళ్ళు శుభ్రం చేసి ముగ్గులతో పసుపుకుంకాలతో, మామిడి ఆకులతో తోరణాలతో అలంకరిస్తారు. తలంటి పోసుకుని, కొత్త బట్టలు కట్టుకొని, ఉగాది పచ్చడితిని పండుగ రోజును ప్రారంభిస్తారు. ఈ పచ్చడిని ప్రసాదంగా పెడతారు. దీనిని తినకుండా ఏ పనీ చేయరు.

ఈ పచ్చడిలో ఉప్పు, పులుపులాంటి ఆరు రుచులు ఉంటాయి. వేప చేదు, బెల్లం తీపి కలిసి ఉంటాయి. జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను ఓర్పుతో సమంగా అనుభవించాలని దీనినుంచి గ్రహించాలి. రకరకాల పిండివంటలతో భోజనం చేసి ఆనందంగా గడుపుతారు. 'పంచాంగ శ్రవణం' అనే పేరుతో దేవాలయాలలో పండితులు పంచాంగం చదివి వినిపిస్తారు. తిథి, వారం, నక్షత్రం, రాశులు మొదలైన విశేషాలను, మనుష్యులపైన, సమాజంపైన, దేశంపైన వాటి ప్రభావాన్ని చెప్పేది పంచాంగం. దీనిలో కొత్త సంవత్సరం ఎలా గడవబోతోందో చెప్తారు.

ఈ ఉగాది పండుగనే మహారాష్ట్రలో, మధ్యప్రదేశ్‌లో "గుడిపడవ" అనే పేరుతో జరుపుకుంటారు. ఉగాది పండుగ కొత్త సంవత్సరం మొదటిరోజు కనుక ఆరోజు ఏరకంగా గడిస్తే ఆ సంవత్సరం అంతా అలాగే ఉంటుందని ప్రజలు నమ్ముతారు. అందుకని ఈరోజు అందరూ ఆనందంగా గడపాలని ఆశిస్తారు.



"వచ్చేనమ్మా వచ్చేనే ఉగాది పండుగ వచ్చేనే
ముచ్చటైనా పావడా, జడకుచ్చులు కొని తెచ్చేనే
అత్తవారి ఇంటికి సరికొత్త అల్లుడు వచ్చేనే
చిట్టి మరదలు పొట్టి బావను పట్టి సరసాలాడేనే"

అంటూ చిన్నారులు ఉగాది సంబరాలు ఆడుకుంటూ పాడుకుంటూ జరుపుకుంటారు.

## చేదు పచ్చడి ప్రసాదమా

ఉగాదికాలంలో ప్రకృతిమాత ప్రసాదించే కానుకల్ని కలుపుకొని ఈ పచ్చడి చేస్తారు. ఇందులో కాస్త కొత్త బెల్లం, రవ్వంత చింతపండు, చిటికెడు ఉప్పు, మామిడి పిందెల ముక్కలు, వేపపూలు, కొంచెం పచ్చిమిరప ముక్కలు, అరటిపండు ముక్కలు వేస్తారు. తీపి, పులుపు, ఉప్పు, కారం వగరు, చేదు, అనే ఆరురుచులు దీనిలో కలిసాయి కదా. తమాషా ఏమిటంటే ఇదే ఈ పండుగ ప్రత్యేకమైన పిండివంటలాగా అనుకొని దేవుడికి అర్పించి ప్రసాదంగా ఇరుగు పొరుగు వారితో పంచుకుంటారు.

దీనిలో ఎంతో అంతరార్థం ఉన్నది తెలుసా ! ప్రకృతి అందించిన రకరకాల అనుభవాలను సుఖ సంతోషాలతో పాటు కష్టనష్టాలను కూడా సమానంగా అందుకునే నిబ్బరం మనిషిలో ఉంటుందనే సత్యాన్ని చాటటానికి ఇది ప్రతీక. కొంచెం నెయ్యికూడా దీనిలో వేస్తారు. దీని భావం ఏమిటంటే సుఖాలు, కష్టాలు మనకు అంటకుండా నెయ్యిలాగా మనసు ఉండాలి అని.

చూశారా ! మనపూర్వీకులు ఎంత గొప్పవారో. ఈ సంవత్సరంలో అంతా సుఖమే కావాలి అనే దురాశ లేదు. కష్టాలొస్తాయని భయంలేదు. పచ్చడితో అన్నీ సమంగా స్వీకరించే మనస్తత్వం పెంచుకోవాలని ఆదర్శం బోధించారు.

## పండుగలో పరమార్థం

భారతీయుల పండుగలన్ని అంతరార్థముతో కూడి ఉన్నాయి. భగవంతుని స్మరింపజేసి ఆనందమును అనుభవింపచేసి దుఃఖములను దూరముచేసే నిమిత్తమై ఈ పండుగలు ఏర్పడుతున్నాయి.

ఏ పండుగ వచ్చినా ఇంటిని పరిశుద్ధం చేసుకోవడం, ఇంటికి పచ్చని తోరణాలు కట్టడం, తలంటి స్నానం చేయడం, నూతన వస్త్రాలను ధరించడం లాంటి కొన్ని పద్ధతులను పాటిస్తున్నారు. కానీ భౌతికమైన అస్థిరమైన దేహమును పరిశుద్ధం చేసుకోవడం గొప్పతనం కాదు. మీ భావములను, సంకల్పములను పరిశుద్ధం చేసుకోవడానికి ప్రయత్నించాలి. నూతన వస్త్రములను ధరించడం గొప్పతనం కాదు. నూతన సద్గుణములను ధరించాలి. ఇంటికి పచ్చని తోరణాలను కట్టుకోవడం గొప్పతనంకాదు. ప్రేమతత్త్వమనే తోరణాలను కట్టుకోవాలి. ఇంటికి వచ్చిన ప్రతివ్యక్తికి ప్రేమ నందించాలి. అప్పుడే మీరు పండుగను సరియైన రీతిలో జరుపుకున్నవారు అవుతారు.

బాబా.

# ఒక శ్లోకం  ఒక రామాయణం

రామాయణమంటే రామకథ. అది తేనె కంటె తియ్యనిది. అందుకే రామాయణం పారాయణం చేస్తారు. మంచి మనిషికి మారుపేరు శ్రీరాముడు. ఆయన ఎప్పుడూ సత్యమే పలికేవాడు. ధర్మమే ఆచరించేవాడు. శాంతంగా ఉండేవాడు. అందరినీ ప్రేమించేవాడు. అందుకే అందరికీ ఆయనంటే ఇష్టం. మనం శ్రీరామ నవమినాడు శ్రీరాముని పూజిస్తాం ఎందుకో తెలుసా? ఆయన పుట్టినరోజు నవమి. సీతను పెళ్ళి చేసుకొన్న రోజు నవమి. అయోధ్యలో పట్టాభిషేకం చేసుకొన్న రోజు నవమి. మూడు గొప్ప సంఘటనలు జరిగిన ముచ్చటైన రోజు శ్రీరామనవమి.

అందుకే శ్రీరామనవమి మనకు గొప్పపండుగ. చాలమంది సీతారామ కల్యాణోత్సవాన్ని నవమినాడు మధ్యాహ్నం వేడుకగా జరుపుకుంటారు. మా రాముడు పెళ్ళికొడుకాయెనే – మా సీతమ్మ పెళ్ళికూతురాయెనే అని సంబరాలతో గొంతెత్తి పాడుకొంటారు. సీతారాముల పెళ్ళి వేడుక మన కుటుంబ సంస్కృతికి శ్రీరామరక్ష !

రామాయణం రోజూ చదివితే రక్తి, ముక్తి
రామునిలా మనమూ జీవిస్తే కీర్తి, స్ఫూర్తి.

రామాయణాన్ని వాల్మికి మహర్షి సంస్కృత శ్లోకాల్లో రాశాడు. అది ఆరుకాండల పెద్దకావ్యం దాన్ని చదువుతారు. పాడతారు, పారాయణం చేస్తారు, వింటారు, జీవితంలో పాటిస్తారు. మన జీవితానికి ఆదర్శం రామాయణం.

రామాయణమంతా రోజూ చదివి పారాయణం చేయటం అందరికీ వీలుకాక పోవచ్చు. ఎన్నో పనులలో తిరిగే మనకు రామాయణమంతా మనసులో మననం చేసుకోటానికి తోడుపడే శ్లోకాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒక్కటి చదువుకొన్నా చాలు. రామాయణమంతా మనగుండెలో నిండిపోతుంది. తేనెబొట్టు ఒక్కటి రుచిచూచినా తేనె నంతా తాగిన ఆనందం మనకు కలుగుతుంది. కదా ! అలాగే ఈ శ్లోకం చూడండి.

**రామాయ, రామభద్రాయ । రామచంద్రాయ వేధసే ।**

**రఘునాథాయ నాథాయ । సీతాయాః పతయే నమః ॥**

ఈ శ్లోకం మనందరం రోజూ చదువుకుంటాం ఇందులో రామాయణమంతా మనకు జ్ఞాపకం వచ్చే పదాలు ఆరు ఉన్నాయి. ఆ ఆరూ రాముడి పేర్లే. రామాయణంలో ఆరుకాండలున్నాయి కదా! ఒక్కొక్క కాండలో రాముడు మనకు ఎట్లా కనిపిస్తాడో ఒక్కొక్క పేరులో సూచించటం ఈ శ్లోకంలో ఉన్న అంతరార్థం. చూడండి... ఎంత బాగుంటుందో ఆ అర్థం.

బాలకాండలో రాముడు పుట్టి అందరినీ ఆనందింపచేశాడు. రాముడు రావణుని చంపటానికి అయోధ్యలో అవతరించాడు. తనకు ఆశక్తి ఉన్నదని మిథిలానగరంలో శివధనుస్సును విరిచి నిరూపించుకొన్నాడు. రాముడు పరశురాముడి కంటె గొప్పవాడని లోకంలో పేరు తెచ్చుకొన్నాడు. అందుకే “రామాయ” అనే విశేషణం.

అయోధ్యాకాండలో తండ్రిమాట నిలబెట్టటానికి రాజ్యాన్ని వదలి, అడవులకు పోయాడు రాముడు. వంశగౌరవాన్ని, సత్యవ్రతాన్నీ భద్రంగా కాపాడిన రాముడు రామభద్రుడు. అందుకే ‘రామభద్రాయ’ అన్నది.

అరణ్యకాండలో రాముడు చంద్రునివలె అందరి మనస్సులనూ ఆకర్షించాడు. ఆనందింప జేశాడు. పశుపక్ష్యాదులు, మునులు, రాక్షసులు కూడా రాముని దివ్యసౌందర్యానికి మురిసిపోయారు. అందుకే ‘రామచంద్రాయ’ అని పేర్కొన్నారు.

కిష్కింధకాండలో రాముడు వాలిని చంపి రఘువంశరాజులు పాటించే ధర్మాన్ని నిలిపాడు. అందువలన ‘రఘునాథాయ’ అని శ్లోకంలో కీర్తించారు.

సుందరకాండలో రాముడు నాథుడుగా చిత్రించబడ్డాడు. రాముడు సీతాప్రాణనాథుడు, భక్తజన హృదయనాథుడు, కపిసేనానాథుడు. శ్రీరాముడి దివ్యశక్తి సుందరకాండలో హనుమంతుని శక్తిగా ప్రదర్శించబడుతుంది. అందుకే ‘రాముడు దేవుడు’ అన్నట్లు “నాథాయ” అని కీర్తించటం గమనించతగింది.

యుద్ధకాండలో రాముడు రావణ సంహారం చేసి, అయోధ్యకు తిరిగివచ్చి, సీతతో కలిసి పట్టాభిషేకం చేసికొన్న కథనంతా స్ఫురింపచేసేది. “సీతాయాః పతయే” అనే విశేషణం.

తెలుగులో ‘కట్టె, కొట్టె, తెచ్చె’ అని ఒక సామెత ఉంది. మూడు ముక్కల్లో రామకథను చెప్పే చక్కని సూక్తి. ఇలాగే రామాయణాన్నంతా ఒక్క శ్లోకంలో చెప్పే ముచ్చటైన కవిత ఇది.

మనం ప్రార్థనలో చదువుకుండే శ్లోకాలూ, పద్యాలూ ఇటువంటివే. అంటే ఒక శ్లోకం ఒక రామాయణం వంటిదన్నమాట.

ఆచార్య. జి.వి. సుబ్రహ్మణ్యం

## వాక్యవిభూతి :

# స్వామిసూక్తులు

**"నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది"**

**- బాబా.**

నోరు మంచిది అంటే మాటలలో మంచితనం అని అర్థం. మనం ప్రేమగా మాట్లాడితే ఎవరయినా స్నేహితులు అవుతారు. మనం కోపంగా మాట్లాడితే శత్రువులు అవుతారు. మనం మంచిమాటలు మాట్లాడితే ఊరిలో అందరూ మనతో మంచిగానే ఉంటారు. అప్పుడు ఏ ఊరయినా మనకు మంచిదే.

## కథ :-

## మంచినాలుక - చెడు నాలుక

ఒక రాజు తన రాజ్యంలో ప్రజల ఆనందం కోసం ఒక ప్రదర్శన ఏర్పాటు చేయించాడు. ఆ ప్రదర్శనలో మానవులకు ఆనందం కలిగించే వస్తువులను పెట్టమని అన్నిటికన్నా మంచి దానికి బహుమానం ఇస్తారని దండోరా వేయించాడు.

ప్రదర్శన చూడడానికి రాజు స్వయంగా వచ్చాడు. వరుసగా ఎన్నో వస్తువులు అమర్చబడి ఉన్నాయి. పూలు, పండ్లు, మిఠాయిలు, బొమ్మలు, సంగీతవాయిద్యాలు, ఇలా ఎన్నో రకాల బొమ్మలు, వస్తువులు, నమూనాలు ఉన్నాయి. ఒకచోట బంకమన్నుతో తయారుచేసిన నోరుబొమ్మ, దానిలో నాలుక, పక్కన ఆనందంగా ఒక పేదవాడు ఉన్నట్లు ఉంది. క్రింద "మంచినాలుక" అని వ్రాశారు. దానిని చూసి రాజుకు ఆశ్చర్యంవేసింది. రాజు ఆ బొమ్మను చేసిన మతిమంతుడు అనే వాడిని పిలిపించాడు. "ఇలా నోరు, నాలుక బొమ్మ ఎందుకు పెట్టావు" అని అడిగాడు రాజు. "రాజా ! మిగిలిన వస్తువులన్ని మానవుడికి ఇచ్చే ఆనందం కొంచెం సేపే ఉంటుంది. కాని నాలుకతో మంచిమాటలు మాట్లాడితే ఆ మాటలవల్ల వచ్చే ఆనందం మరిచిపోలేము. ఎంతో బాధలో ఉన్నవాళ్ళకు కూడా మంచి మాటలతో దుఃఖాన్ని పోగొట్టి సంతోషం కలిగించవచ్చు. అందుకని మంచి మాటలు చెప్పే నాలుకను మించిన మంచివస్తువు ఇంకొకటి లేదు అన్నాడు మతిమంతుడు. రాజుకు ఆనందం కలిగింది వెంటనే అతడికి సంచినిండా బంగారు నాణాలు బహుమానంగా ఇచ్చాడు.

మళ్ళీ కొన్ని రోజుల తరువాత రాజుకు ఇంకొక ఆలోచనవచ్చింది. మనిషికి బాధ,

దుఃఖం కలిగించేవాటిని ప్రదర్శించాలి. అప్పుడు ప్రజలు వాటినించి దూరంగా ఉంటారు కదా ! అనుకుని ఆ ప్రదర్శన ఏర్పాటు చేయించాడు. మళ్ళీ చాలారకాల వస్తువులు పెట్టారు. కత్తులు, సుత్తులు, ఆయుధాలు, విషం, రోగం, మరణం లాంటి చిత్రాలు, బొమ్మలు ఇలా ఎన్నో ఉన్నాయి. మళ్ళీ నాలుక బొమ్మ పెట్టాడు మతిమంతుడు. కింద "చెడు నాలుక" అని వ్రాసివుంది. రాజు మళ్ళీ అతడిని పిలిపించి "మళ్ళీ నాలుకను ఎందుకు పెట్టావు"? అని అడిగాడు. "మహారాజా ! మనిషిని బాధ పెట్టడానికి అన్నిటికంటె పదునైన ఆయుధం నాలుక. చెడ్డ మాటలతో, తిట్లతో, పోట్లాటలు, యుద్ధాలు తెచ్చేది నాలుకే. చెడ్డమాటలు మాట్లాడడానికి సహాయ పడే నాలుకే బాధకలిగించే వస్తువు. చెడ్డమాట అన్నవాళ్ళు మరిచిపోతారు కాని తిట్టు పడ్డవాడు ఎప్పటికీ మరిచి పోలేదు" అని చెప్పాడు మతిమంతుడు.

అన్నిటికన్న ఇదే మనిషికి మంచి గుణపాఠం నేర్పించే వస్తువు అని రాజు గుర్తించాడు. మళ్ళీ మతిమంతుడికే బహుమానం ఇచ్చాడు.

చూశారా! పిల్లలూ! మనం మనమాటలతో ఎదుటివారిని సంతోషపెట్టవచ్చు, బాధపెట్టవచ్చు. ఏది చేయడం మంచిది. ఆఁ అవును మీరు సరిగ్గా ఊహించారు. మంచిమాటలతో సంతోషపెట్టాలి. ఇవాళనుంచి మనం ప్రేమగా, స్నేహంగా, మాట్లాడుదాం. ముందు ఇంట్లో మొదలుపెడదాం అమ్మతో, నాన్నతో, నాన్నమ్మతో, తాతతో, తమ్ముడితో, చెల్లెలితో ఇలా అందరితో సరేనా !

## చెప్పుకోండి చూద్దాం - పోటీ విజేతలు

"చెప్పుకోండి చూద్దాం" పోటీకి పాఠకులు చూపించిన ఉత్సాహానికి పాల్గొన్న వారందరికీ అభినందనలు. 17వ ఆధారంలో అచ్చు తప్పు దొర్లినా ( ఈ పొరపాటుకు చింతిస్తున్నాము) సరైన జవాబు వ్రాసినందుకు ఆనందిస్తున్నాము. సరైన జవాబు వ్రాసిన వారిలో లాటరీ పద్ధతిలో ఎన్నుకొన్న అయిదుగురికి బహుమతి పంపిస్తున్నాము.

**బహుమతి పొందినవాళ్ళు :-**

1. చదలవాడ గోపీకృష్ణ - తాళ్ళపూడి, ప.గో. జిల్లా
2. అనంతల నాగేంద్ర - తాళ్ళపూడి, ప.గో. జిల్లా
3. జి. సాయి కిరణ్మయి - గణేశ్‌నగర్, కరీంనగర్
4. వై. సరోజిని - మెదక్
5. ఎ. సాయికిరణ్ - హైదరాబాదు.

**పద్యసూక్తి :-**

**చెప్పుట సులభంబు చేయుట కష్టంబు**
**ధాతకైన వాని తాతకైన**
**చెప్పుట కంటెను చేయుటయే మేలు**
**ఉన్నమాట తెలుపు చున్న మాట !**

**భావం :-** ఏదైనా చెప్పటము తేలిక. చెయ్యటం చాలా కష్టం. బ్రహ్మకైనా, ఆయన తాతకైనా ఆచరించటం (చెయ్యటం) కష్టం. మాటలు చెప్పటంకంటే చేయటమే మంచిది.

**కథ :**

## ఆచరణలేని ప్రచారము వ్యర్థము

కలకత్తాలో రామకృష్ణ పరమహంస దగ్గర ఒక శిష్యురాలు ఉండేది. ఆమె చాలాపేదది. ఒకరోజు తన కొడుకుని తీసుకొని వచ్చింది. "గురుదేవా ! మా అబ్బాయి రోజూ మిఠాయిలు తింటాడు. దానివల్ల వాడికి కడుపునొప్పి వస్తుంది. ఆరోగ్యం పాడవుతున్నది. అంతేకాక నేను పేదదాన్ని రోజూ మిఠాయిలు కొనడానికి తగినంత ధనం కూడా నాదగ్గర లేదు. మిఠాయిలు మానమని చెప్తే వీడు వినటంలేదు. దయచేసి వీడికి మిఠాయిలు తినవద్దని చెప్పండి" అని వేడుకుంది.

రామకృష్ణ ఆ అబ్బాయివంక చూశారు. ఏమీ మాట్లాడలేదు. ఆమెతో "అమ్మా ! ఒకపక్షం (15 రోజులు) తరువాత ఇతనిని తీసుకుని రా" అన్నారు. 15 రోజులు గడిచాయి. ఆమె బాలుడిని తీసుకుని మళ్ళీ వచ్చింది. రామకృష్ణ ప్రేమతో బాలుడిని చూసి "తల్లీ ! మళ్ళీ ఒక పక్షం తరువాత రండి" అన్నారు.

మళ్ళీ 15 రోజుల తరువాత కొడుకుని తీసుకుని ఆ తల్లి వచ్చింది. రామకృష్ణ ఆ బాలుడితో "ఏం నాయనా ! రోజూ మిఠాయిలు తెమ్మని మీ అమ్మని బాధపెడుతున్నావా?" అని అడిగారు. అతడు తలవంచుకొని "అవునండీ" అని అన్నాడు.

"నీవు తెలివైనవాడివి కదా. రోజూ మిఠాయిలు కావాలంటే డబ్బు చాలాకావాలి కదా? డబ్బంతా మిఠాయిలకు ఖర్చుచేస్తే మీ అమ్మ నీకు పుస్తకాలు బట్టలు ఎలాకొంటుంది? అంతేకాకుండా మిఠాయిలతో నీ ఆరోగ్యం పాడయితే మందులకు డాక్టరుకి కూడా డబ్బు కావాలికదా! నీ మిఠాయిలతో నీతల్లికి ఎంతబాధోచూడు. మరి నువ్వు చేసేది తప్పా? కాదా?" అని అడిగారు.

"అవును" అని తల ఊపాడు బాలుడు. "అయితే ఇవాళనుంచి మిఠాయిలు మానేస్తావా?"

అన్నారు గురుదేవుడు. సరేనని వప్పుకున్నాడు పిల్లవాడు. "మా అమ్మను ఇంక బాధపెట్టను" అని బుద్ధిగా చెప్పాడు. "చాలా సంతోషం నాయనా నీకు మంచి ఏదో చెడుఏదో తెలుసు నీవు సుఖంగా జీవించు" అని ఆశీర్వదించారు.

ఆ బాలుడు సంతోషంగా తోటలోకి వెళ్ళాడు. అతడి తల్లి గురువుకు నమస్కరించి కృతజ్ఞతలు చెప్పింది. "గురుదేవా! ఈమాట చెప్పడానికి ఇన్నిరోజులు ఎందుకు ఆగమన్నారు ఇన్ని సార్లు ఎందుకు తిప్పించారు" అని అడిగింది.

రామకృష్ణ నవ్వుతూ "అమ్మా అప్పుడప్పుడు భక్తులు నాకు మిఠాయిలు తెస్తారు. నేను వాటిని తింటాను. నేను రోజూ మిఠాయిలు తింటూ పిల్లవాడిని తినవద్దని ఎలా చెప్తాను? అందుకని నువ్వు మొదటిసారి వచ్చిన దగ్గరినుంచి నేను తీపి తినడం మానేశాను. నేను పూర్తిగా మానెయ్యడానికి ఇన్ని రోజులు పట్టింది. మనం ఆచరిస్తూ ఇతరులకు చెప్తేనే ఆ మాటకు విలువ ఉంటుంది. ఈ రోజు నేను చేస్తున్నది మాత్రమే చెప్పాను" అన్నారు రామకృష్ణ.

అక్కడ ఉన్న భక్తులంతా రామకృష్ణ పరమహంస గొప్పదనాన్ని తెలుసుకున్నారు. చూశారా! మహాత్ములు ఏది చేస్తారో అదే చెప్తారు. అందుకే వాళ్ళ మాటలకు గొప్ప శక్తి ఉంటుంది.

## ఆటలు - పాటలు

## మెదడుకు మేత

### రామనామ తారకం

| | | | |
|---|---|---|---|
| సీ | త | | |
| జా | న | కి | |
| అ | వ | ని | జ |

ఇలాగే క్రింద గడులలో ఒక్కొక్క వరుసలో రాముని పేర్ల అక్షరాలతో నింపండి.



పి. సుబ్బరాయుడు, హైదరాబాదు.

(జవాబులు చివరి పేజిలో)

# ఆటలు - పాటలు

## "సీత - రామ" ఆట

పిల్లలూ ! ఎండాకాలం సెలవులు వస్తున్నాయి కదా! ఎండలో పరుగెత్తి ఆరోగ్యం పాడు చేసుకోకుండా నీడన ఉండే ఆటలు ఆడుకోండి. అలాటివాటిలో ఈ 'సీతారామ' ఆట ఒకటి.

దీనికి పిల్లలు ఎంతమందయినా ఉండొచ్చు అందరూ గుండ్రంగా కూర్చోండి. ఒకరు లీడరుగా (ఆడించేవాళ్ళు) ఉండాలి. పిల్లలకు అందరికి ఒకరిని వదిలి ఒకరికి సీత, రామ అని పేర్లు ఇవ్వండి. లీడరు, సీత అనగానే 'సీత' అనే పేరు పెట్టుకున్న గ్రూపులో వాళ్ళు చెయ్యి ఎత్తాలి. 'రామ' అనగానే రాముడి పేరు పెట్టుకున్న వాళ్ళు చెయ్యి ఎత్తాలి. లీడరు మార్చి మార్చి సీత, రామ అని అంటూ ఆ గ్రూపువాళ్ళు సరిగా చేతులు ఎత్తుతున్నారేమో చూడాలి. ఎవరు తప్పుగా చెయ్యిఎత్తినా వాళ్ళు ఔటు. వాళ్ళ పేరు పిలిచినపుడు చెయ్యి ఎత్తకపోయినా ఔటే.

లీడరు స్పీడుగా అనటం రామ, రామ అని సీత, సీత అని మార్చకుండా రకరకాలుగా తికమక పెట్టి చాలామందిని ఔటుచేయవచ్చు. అలా చివరిదాకా సరిగ్గా చేతులెత్తిన పిల్లలు ఇద్దరు ముగ్గురుమిగిలాక వాళ్ళకు మార్చి మార్చి చెప్పాలి. చివరికి మిగిలిన వాళ్ళు Ist, ఇద్దరున్నవాళ్ళు IInd, మూడవస్థానంలో మిగిలినవాళ్ళకు IIIrd ప్రైజు ఇలా ఎంచుకోండి.

ఆడి చూడండి. గెలిచి ఆనందించండి. దీనితో రామనామం అన్నిసార్లు పలకడంవల్ల పుణ్యమూ వస్తుంది. చేతులు ఎత్తడంలో మనసును వినేమాటమీద కేంద్రీకరించడం వల్ల మనసుకు జ్ఞాపకశక్తి (Memory power), ఏకాగ్రత (concentration) పెరుగుతాయి. ఈ శక్తి మీరు చదువుకునే చదువులో మంచి మార్కులు తెచ్చుకోవడానికి సహాయపడుతుంది. పుణ్యమూ, పురుషార్థమూ అంటే ఇదే.

**_Printed & Published by :_**
Smt. Lalitha Omapathi Rao, Convener, Mahila Vibhag, Phone : 3397783
Sri Sathya Sai Seva Organisation, Hyderabad.
Editor : Dr. M. Lavanya Saraswathi, M.A., M.Phil., Ph.D., Phone : 040 - 3730655

**_For Correspondence :_**
Sri T. S. N. Rao
F 2, B Block, Brindavan Apartments, Chikoti Gardens,
Begumpet, Hyderabad - 500 016. Tel : 7764253, 6311159

**_Printed at :_**
Sairam Printers Pvt. Ltd. Hyderabad. 500 004. Tel : 3232316, 3237598

మన చారిత్రక పురుషులు



# గాంధీ - రామభక్తి

తల్లిదండ్రులకు భక్తి ఉండడంవల్ల గాంధీ గుడికి ఎక్కువగానే వెళ్ళేవాడు. అయితే దేవాలయం అంటే ఎక్కువ ఇష్టం ఉండేదికాదు. దేవాలయంలో ఆడంబరం ఆయనకు నచ్చలేదు. వాళ్ళ ఇంట్లో రంభ అనే ఒక పనిమనిషి ఉండేది. ఆమె చాలాకాలం నుంచి పనిచేస్తూ ఉండేది. ఆమెకు గాంధీ అంటే చాలా ప్రేమ. గాంధీకి చిన్నప్పుడు చీకటి అంటే చాలా భయం. రంభ దగ్గరకు పరుగెత్తేవాడు. రంభ ధైర్యం చెప్పేది. భయం పోగొట్టడానికి ఒక మందు చెప్పింది. ఆ మందు ఏమిటో తెలుసా? రామ ! రామ ! రామ అని నామస్మరణ చేయడం. భయం పుట్టినప్పుడు రామనామం జపించమని చెప్పింది. రంభచెప్పిన ఈ మందు గాంధీ మనసుమీద మంత్రంలాగా పనిచేసింది. ఆ చిన్న వయస్సునుంచి రామనామం జపం చేయడం మెల్ల మెల్లగా అలవాటుగా మారిపోయింది. గాంధీకి దీనితో శాంతి, ధైర్యం ఏర్పడేవి.

గాంధీ చిన్నాన్న కొడుకు రామభక్తుడు. ఆయన గాంధీకి, గాంధీ అన్నగారికి రామ రక్షా స్తోత్రం నేర్పించాడు. వాళ్ళిద్దరూ ఆస్తోత్రం కంఠస్థం చేశారు. ప్రతిరోజూ ప్రొద్దునేలేచి, స్నానం చేసి ఆ రామనామస్తోత్రం జపం చేసేవాళ్ళు. గాంధీకి 13 సం॥ల వయస్సు వచ్చింది.

పోరుబందరులో రామాలయంలో 'లాఘా మహరాజ్' అనే ఆయన రామాయణం పాడుతూ అర్థం కూడా చదివి చెప్పేవాడు. (దీనినే పారాయణం అంటారు) ఆయన రామకథ వినిపిస్తే ఆనందంగా వింటూ ఉండేవాడు గాంధీ. అనాటి రామాయణ పారాయణంవల్ల రామాయణం పట్ల గాంధీకి ప్రేమ కలిగింది. తులసీదాసు రామాయణం ఉత్తమమైన గ్రంథం అనేవాడు గాంధీ. బాల్యంలో మంచిచెడుల ప్రభావం హృదయం మీద అమితంగా పడుతుంది. "బాల్యంలో అటువంటి గ్రంథాలు అన్నీ వినలేదే అని విచారం నాకు కలుగుతుంది" అంటారు గాంధీగారు. భాగవతం ఎక్కువగా వినలేదు. రాజకోటలో ఒకచోట భాగవత పారాయణం జరిగేది. ఆయన చెప్పింది పిల్లలకు ఎక్కువ అర్థం కాలేదు. కాని భాగవతంలో భక్తి ప్రధానంగా ఉంది అని తెలిసింది గాంధీకి. అదికూడా బాగా విని ఉంటే రామాయణంలాగానే గాంధీకి ఇష్టమైనదిగా ఉండేది. అందుకే చిన్న వయస్సులో గొప్ప గొప్ప గ్రంథాలు కథలుగా వినాలి. బొమ్మలుగా చూడాలి. పాటలుగా పాడాలి. ఆడిపాడే వయస్సులో కలిగే ఇలాంటి భావాలవల్లే పెద్దయ్యాక కూడా రాముడిలాగా గొప్పవాడుకావాలి. తండ్రి పట్ల గౌరవం చూపాలి. రాముడిలాగా సత్యం ధర్మం కోసం జీవించాలి అనే మంచి ఆలోచనలు గాంధీగారిలో కలిగాయి. జీవితాంతం అవే అలవాట్లుగా నిలిచిపోయాయి. గాంధీకి క్రమంగా దేవుళ్ళపైన భక్తి, గౌరవం ఏర్పడసాగాయి.



# మోసం దాగదు

అనగనగా ఒక అడవి. ఆ అడవికి రాజు సింహం. తన రాజ్యానికి ముఖ్యమంత్రిని నియమించాలని నిశ్చయించి, అన్నిట్లోకి అందమైన పక్షిని ఆ పదవికి ఎంపిక చేయాలని నిర్ణయించింది సింహం. ఇందుకోసం రాజ్యంలోని పక్షులకి ఒక పోటీ కూడా ఏర్పాటు చేసింది.



పోటీరోజు దగ్గరౌతున్న కొద్దీ పక్షుల హడావుడి పెరగసాగింది. ఎంతో ఉత్సాహంతో తమ శాయ శక్తులా అందంగా తయారు కాసాగాయి. కానీ అద్దంలో తన అవతారాన్ని చూచుకొన్న కాకి మాత్రం ఎంతో కలవరపడింది. ఆలోచించింది. కాకికి మెరుపులాంటి ఉపాయం తట్టింది. అంతే! ఆరోజునుంచి అడవంతా గాలించి, రకరకాల అందమైన పక్షుల రంగురంగుల ఈకలన్నీ పోగు చెయ్యసాగింది.



పోటీ రోజున అడవిలోని పక్షులన్నీ అందంగా ముస్తాబై రాజుగారి సభకి వచ్చేశాయి. మన కాకి కూడా పోగు చేసిన అందమైన ఈకల్ని తన రెక్కల్లోను, తోకలోనూ అతికించుకుని అక్కడికి చేరింది.



సింహరాజుగారు సభతీరారు ! వచ్చిన పక్షులన్నీ వరుసగా రాజుగారిముందు కిలకిలారావాలు చేస్తూ విలాసంగా నడుస్తూ తమ తమ అందాల్ని ప్రదర్శించాయి.



చివరికి కాకివంతు వచ్చింది. అతి జాగ్రత్తగా, అంటించుకున్న ఈకలేవీ ఊడకుండా తన అందం ప్రదర్శించింది కాకి. రంగురంగుల ఈకల్తో అందాన్ని అరువు తెచ్చుకున్న కాకి రాజుగారికి నచ్చింది. సింహం కాకిని ముఖ్యమంత్రిగా ప్రకటించింది.

ఈ నిర్ణయం పట్ల పక్షుల్లో సంచలనం రేగింది. అవన్నీ కాకి మీద విరుచుకుపడి, అది అంటించుకున్న ఈకలన్నిటినీ పీకి పారేశాయి. ఆఖరికి తోకలో తురుముకున్న ఫించాన్ని కూడా నెమలి వచ్చి లాగేసింది.





జరిగిన మోసాన్ని గ్రహించిన సింహరాజు కాకిని శిక్షించింది. అందమైన నెమలిని మంత్రిగా నియమించింది. అసలు బండారం బయటపడ్డ కాకి, అవమానముతో కృంగిపోయింది.

**లేని అర్హత కపట వేషంతో రాదు !**
**నిప్పులాంటి నిజం ఎప్పటికీ దాగదు !!**

# వసంత ఋతువు వచ్చింది



వసంత ఋతువు వచ్చింది,
వన్నెలు చిన్నెలు తెచ్చింది
ఆటలు పాటలు నవ్వులతో,
హాయిగా మనము గడిపేద్దాం ॥

తోటలు పచ్చగ మెరిశాయి, చిగురులు వేసి పెరిగాయి
రంగుల పువ్వులు విచ్చాయి, మల్లె పువ్వులు వచ్చాయి ॥ ॥వసంత॥

కోయిల తీయగ కూసింది, కమ్మని పాటలు పాడింది
చిలుకలు పలుకులు పలికాయి, సీతాకోకలు వచ్చాయి ॥ ॥వసంత॥

మామిడి పిందెలు వేసింది, వేప పూతలు పూసింది
ఉగాది పండుగ చేసేద్దాం, రాముడి పెళ్ళి చూసొద్దాం ॥ ॥వసంత॥



*చైత్ర వైశాఖాలు వసంతఋతువు. ఈ ఋతువులో ప్రకృతి సౌందర్యం ఎంత బాగుంటుదో కవులు, గాయకులు ఎన్నెన్ని కవితలల్లారో లెక్కలేదు. ఇది తరతరాలుగా చదువుతున్నాం, వింటున్నాం. మరీ ఎండలు ముదరకుండా చలి శివరాత్రితో 'శివ శివా' అంటూ జారుకుని ప్రకృతి మనస్సుకు ఆహ్లాదం కలిగించేదిగా ఉంటుంది. ఇదే వసంతఋతువు.*



# మీవిలువ ఎంత? క్విజ్

## ఉగాది స్పెషల్ - క్విజ్

1. తెలుగు నెలల పేర్లు ఏవి ?
2. ఋతువులలో మొదటిది ఏది ?
3. ఋతువులు ఎన్ని ? అవి ఏవి ?
4. పక్షం అంటే ఎన్ని రోజులు ?
5. పక్షాలు ఎన్ని ? అవి ఏవి ?
6. అయనాలు ఎన్ని ? అవి ఏవి ?
7. ఉగాది పండగ ఎప్పుడు వస్తుంది ? (తెలుగు నెలల ప్రకారం)
8. శ్రీరామనవమి ఎప్పుడు వస్తుంది ? (తెలుగు నెలల ప్రకారం)
9. తిథులు ఎన్ని ? అవి ఏవి ?
10. తెలుగు సంవత్సరాలు ఎన్ని ? అవి ఏవి ?

మీ విలువ ఎంత? మీరే పరీక్షించుకోండి. పిల్లలూ ! మీరు వీటికి సమాధానాలు వచ్చినంతవరకు వ్రాసి పెద్దలను, గురువులను అడిగి సరిచూసుకోండి.

10 ప్రశ్నలకు జవాబులు రైట్లు వస్తే మీరు "బంగారు కొండ"

9,8 .......................... రైట్లు వస్తే మీరు "బంగారు"

7,6 .......................... రైట్లు వస్తే మీరు "వెండి బరిణె"

5 .............................. రైట్లు వస్తే మీరు "రాగిచెంబు"

4 .............................. రైట్లు వస్తే మీరు "ఇనుపముక్క"

3 .............................. రైట్లు వస్తే మీరు "పప్పుచెక్క"

2 .............................. వస్తే "సుద్దముక్క"

1 .............................. వస్తే "తొక్కుడుబిళ్ళ"

0 ............................ వస్తే ఏం చేద్దాం

మీలో బంగారు కొండలు ఎవరో మాకు ఉత్తరం రాయండి.

తక్కువ వస్తే బాధ పడవద్దు. వచ్చేనెల పత్రికలో చూసి నేర్చేసుకోండి. మీరూ బంగారు కొండలయి పోవచ్చు.

**( సమాధానాలు వచ్చే సంచికలో )**

# స్వామి కథ (సీరియల్)

నాయనమ్మ లక్ష్మమ్మగారు మెత్తటి బట్టలతో తయారు చేసిన పక్కమీద అప్పుడే పుట్టిన ఆ పసి పిల్లవాడిని పడుకోబెట్టారు. కొంచెం సేపు తరువాత చూస్తే పక్కబట్ట కొద్ది కొద్దిగా కదులు తున్నది. ఏమిటో అని దగ్గరకు వెళ్ళిచూస్తే బట్టకింద ఒక పాము కదులుతున్నది. భయంతో పిల్లవాడిని తియ్యబోయారు. ఇంతలో ఆ పాము పడగ ఎత్తి ఆ పిల్లవాడి తలపైన గొడుగులాగా పట్టి వెళ్ళిపోయింది.

కొండమరాజుగారు బుక్కపట్నంలో శకునాలు చెప్పే పెద్దలను కలిసి ఇలా ఎందుకు జరిగింది అని అడిగారు. ఆ బాలుడు మామూలు పిల్లవాడు కాదు. దైవస్వరూపుడు అయిఉండవచ్చు. అందుకే ఇలాంటి మహత్యాలు జరుగుతున్నాయి అన్నారు.

లక్ష్మమ్మగారు ఇచ్చిన సత్యనారాయణవ్రతం ప్రసాదం ఈశ్వరాంబగారు తినిన తరువాత ఈ బాలుడు పుట్టాడు కదా! అందుకని సత్యనారాయణ రాజు అని పేరు పెట్టారు.

శ్రీకృష్ణుడు చెరసాలలో అర్ధరాత్రి పుట్టినపుడు బ్రహ్మ మొదలైన దేవతలు ఆనందించారు. బ్రహ్మదేవుడు "సత్యవ్రతుడు, సత్యరూపుడు, సత్యాత్మకుడు, సత్యనేత్రుడు, సత్యమునకే ఆధారము, సత్యముతోనే పొందదగినవాడు" అని ఆ బాలుడిని స్తుతించాడు. ఆ పరమాత్మ భూమిమీద అవతరించగానే బ్రహ్మకు 'సత్యము' అన్న మాటతప్ప మరొక మాట రాలేదట.

అదేవిధంగా పుట్టపర్తిలో పుట్టిన ఆ బాలుడిని చూడగానే ఏ శాస్త్రాలు చదవకపోయినా పెద్ద వాళ్ళ నోటివెంట 'సత్యం' అనే పిలుపువచ్చింది. పుట్టపర్తిలో పుణ్యాత్ములు ఉయ్యాలలోని పసిబిడ్డలో దివ్యశక్తిని చూడగలిగారు. సత్యా ! సత్యా ! అని పిలువసాగారు.

కొండమరాజు గారికి సత్యం దైవాంశతో పుట్టాడు అని గట్టి నమ్మకం. ఆయన ఆ బాలుడిని చాలా ముద్దు చేసేవారు. పూజగదిలోకి కూడా తీసుకుని పోయి పక్కనే పడుకోబెట్టుకుని ధ్యానం చేసేవారు సత్యం ! సత్యం ! అని పిలిచేవారు.

వాళ్ళ పక్క ఇల్లు ఆ ఊరి కరణంగారిది. కరణంగారి భార్య సుబ్బమ్మ ఎప్పుడూ ఈశ్వరాంబగారితో కలిసి ఉండేది. 'సత్యం' అంటే చాలా ఇష్టం. సత్యంను తమ ఇంటికి తీసుకువెళ్ళి ఆడించేది. సుబ్బమ్మగారికి కూడా సత్యం మామూలు బాలుడుకాదని నమ్మకంగా ఉండేది. సత్యం క్రమంగా పెరిగి పెద్ద అవుతున్నాడు.

(ఇంకావుంది)

# పుట్టిన రోజు పండుగ

పుట్టిన రోజు పండుగ మన బంగారు సాయి పుట్టిన రోజు పండుగ
పుట్టిన రోజున పట్టెడు పూలు చెట్టు చెట్టున నవ్వాయి
పూల నవ్వులే వేళ విరియుచు జగతికి వన్నెలు తెచ్చాయి ॥పుట్టిన॥

మాటల ముత్తెము మెరవాలి పాటల కోకిల కులకాలి
ఆటల హంసలు అందాలొలికి జగతికి వన్నెలు దిద్దాలి ॥పుట్టిన॥
పండగ పేరంటానికి అమ్మలు అందరు వచ్చారు
వాడలు వాడలు వెలసిన దేవుని సందర్శింపగ వచ్చాయి. ॥పుట్టిన॥

ఎ.ఎల్. సరోజిని, నూజివీడు.

## "స్వామి పుట్టిన రోజు"



ఎ. వినోద్ 7వ తరగతి
బాలవికాస్ గ్రూప్ 2

నీతి కథలు

# పిట్టపోరు – పిల్లితీర్పు



అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక పెద్దచెట్టు. ఆచెట్టు తొఱ్ఱలో చాలాకాలం నుంచి ఒక పిట్ట నివసిస్తూ ఉండేది. ఒకరోజు సాయంత్రం చాలా పెద్దవాన కురిసింది. చీకటి పడింది. అయినా వాన తగ్గ లేదు. పిట్ట తన చెట్టు దగ్గరికి రాలేకపోయింది. ఇంకా వాన పడుతూనే ఉంది ఆవానలో తడిసిపోయిన కుందేలు ఒకటి అక్కడకు వచ్చింది. చెట్టు తొఱ్ఱ చూసి వాననుంచి రక్షించు కోవడానికి దానిలో దూరింది. వాన బాధతప్పింది. కాసేపటికి అది హాయిగా నిద్రపోయింది.

ఇంతలో వానకు తడిసిన రెక్కలతో ఎగరలేక ఎగరలేక బాధపడుతూ చీకటిలో వెతుక్కుంటూ తన చెట్టు తొఱ్ఱ దగ్గరికి పిట్ట వచ్చింది. లోపల హాయిగా నిద్రపోతున్న కుందేలుని చూసేసరికి చాలా కోపం వచ్చింది.

“ఏయ్ కుందేలూ! ఇది నా యిల్లు. నేను ఇంట్లో లేనప్పుడు వచ్చి నాయింట్లో దూరి పడుకుంటావా? నా ఇల్లు వదిలి వెళ్ళిపో. లేకపోతే నీ ప్రాణాలు తీస్తాను” అని బెదిరించింది. కుందేలు భయపడలేదు. “ఇది నీ ఇల్లా? అడవిలో నివసించే ప్రాణులకు స్వంతం అనేది ఉండదు. ఏ రోజు ఏ జంతువు ముందు వచ్చి ఆక్రమించుకుంటుందో ఆ రోజు ఆ చోటు దాని యిల్లు. పో! పో! ఇవాళ నీకంటె ముందు నేను వచ్చాను కనుక ఈ తొఱ్ఱనాదే. కావాలంటే ఎవరినయినా న్యాయం అడుగుదాం. రా!” అని అన్నది.

పిట్ట వెనకాడలేదు “ఎన్నో రోజులనుంచి ఇక్కడ నేనే నివసిస్తున్నాను. ఇది నా స్వంతంకాక

నీది అవుతుందా? సరే న్యాయం అడుగుదాం పద. అయితే ఎవరిని అడుగుదామో కూడా నువ్వే చెప్పు నాకేం భయం లేదు" అన్నది.

"నర్మదానదీ తీరంలో ఒక పిల్లి ఉన్నది. అది చాలా ధర్మాలు చదివింది. శాంతమూర్తి. ఎన్నో తీర్పులు చెప్పగల నేర్పు దానికి ఉంది. ఆ పిల్లి దగ్గరకు పోదాం. సరేనా?" అన్నది కుందేలు. "సరే! పోదాం కాని ఇంతరాత్రివేళ ఎక్కడికి పోతాము? ఈ పూటకి సర్దుకుందాం రేపు ఉదయమే వెళ్దాము" అన్నది పిట్ట.

రెండూ కలిసి మర్నాడు అ వృద్ధురాలైన పిల్లి దగ్గరకు వెళ్ళాయి. "ఓ పిల్లిరాజా ! మాకు ఇంటిగూర్చి తగాదా వచ్చింది. మాకు న్యాయం చెప్పు" అని అడిగాయి. ఆ ముసలి పిల్లి "మీరు ఏదో చెప్తున్నారు. నాకు దూరమునుంచి మాట్లాడితే వినపడదు. నేను అసలే వ్రతాలు, ఉపవాసాలు చేస్తూ నీరసంగా ఉన్నాను. మీ ఇద్దరూ నాకు దగ్గరగా రండి. చెరి ఒక చెవి దగ్గరకు వచ్చి పెద్దగా చెప్పండి. నేను దీక్షలో ఉన్నాను. దానధర్మాలు చేసే సమయం అయింది. ధర్మాన్ని మానకూడదు. వేయి ఆపదలు వచ్చినా సత్యధర్మాలు విడువకూడదు. సత్యమే సర్వశుభములకు మూలము. సత్యానికి తోడు దయకూడా ఉండాలి. ఈ లోకంలో ఏదీ మన వెంట తీసుకుపోము సరే, మీ తగాదా గూర్చి చెప్పండి" అని అన్నది పిల్లి.

దాని మాటలు విన్న పిట్టకు, కుందేలుకు దానిమీద నమ్మకం ఏర్పడింది. రెండూ రెండు చెవుల వైపుకు వెళ్ళాయి. ఆ ముసలి పిల్లి ఒక్క క్షణంలో దాని పంజాలతో రెండింటి గొంతు పట్టుకుంది. చంపేస్తున్నది. ప్రాణాలు పోతున్న బాధలో అవి రెండు తమ తప్పు తెలుసుకున్నాయి. అయ్యో! ఒక్కరాత్రి తొఱ్ఱలో ఎవరు పడుకుంటే ఏమి అని ఊరుకోక లేనిపోని తగాదా పెట్టుకున్నాము. ఇల్లుమీద ఆశతో, దుర్బుద్ధి ఉన్న ఈ పిల్లిని నమ్మి చావు తెచ్చుకున్నాము. ఒక్కపూట ఓర్చుకుని ఉంటే ఇలా ప్రాణం పోయేది కాదు కదా ! అని బాధతో గిల గిలలాడుతూ ప్రాణం వదిలాయి.

చూశారా ! పిల్లలూ ! ఓర్పుతో ఉండాలి. మనలో మనం అనవసరమైన తగాదాలు పెట్టుకో కూడదు. ఒకరితో ఒకరు పోట్లాడుకో కూడదు. తియ్యటి మాటలతో మోసంచేసే దుష్టులను నమ్మకూడదు. స్నేహం పెంచుకోవాలి తప్ప శత్రువులను పెంచుకోకూడదు.

## రచయితలకు మనవి

- హాస్యరచనలు, కార్టూనులు, జోకులు, చమత్కార సంభాషణలు;
- గ్రామసేవ అనుభవాలు, సమస్యలు, ఫలితాలు;
- బాలవికాస్ పిల్లల అనుభవాలు పిల్లల రచనలు, పిల్లల కవితలు;
- పిల్లలకు చేతిపనులు, పిల్లలు చేయగల బొమ్మల తయారీ వివరణలు;
- ఫోటోలతో సహా స్థల పురాణాలు;
- బాలవికాస్ బోధనలో గురువుల అనుభవాలు, సమస్యలు, పిల్లల చిలిపి ప్రశ్నలు, గురువుల చతుర సమాధానాలు;
- బాలవికాస్ గురించి తల్లిదండ్రుల భావాలు;
- స్వామి ఆదర్శాలను, బోధలను నిత్య జీవితంలో ఆచరించడంలో అనుభవాలు;
- శాస్త్ర విజ్ఞానంలో వింతలు విడ్డూరాలు;

గూర్చిన రచనలు ఆహ్వానిస్తున్నాం.

# భగవద్గీత - "మనకెందుకంట"?

సంతోషం ఎక్కడ ఉంది? దేనిలో ఉంది ? ఐస్‌క్రీమ్ ఆనందం ఇస్తుందా? రిబ్బను కొనుక్కుంటేనా? చాక్లెట్ తింటేనా? కొత్తబట్టలు కడితేనా? కొత్తఇంటికి పోతేనా? కొత్త టి.వి. కొంటేనా? కొత్త ఊరికి వెళ్తేనా? కొత్త సినిమా చూస్తేనా? వీటన్నిట్లో, పొందిన తరువాత కాసేపటికి సంతోషం అయిపోతుంది. జాగ్రత్తగా గమనిస్తే తరువాత మనం అనుకున్నంత ఆనందం కలగలేదే అనిపిస్తుంది. అది తొందరగా పాతది అయిపోతుంది.

మళ్ళీ వెంటనే కొనాల్సిందో, కావాల్సిందో ఇంకోకటి మనలిస్టులో రెడీగా ఉంటుంది. అదిలేదే అని ఆరాటం మొదలవుతుంది.

చదువులు, మార్కులు, పాసులు, క్లాసులు, రాంకులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు, పిల్లలు ఇలా ఒకదాని తరువాత ఒకటి నడుస్తూనే ఉంటాయి. అవి మనం అనుకున్నట్లు జరిగితే కొన్నాళ్ళు ఆనందంతో ఎగురుతాం. సుఖాలు కొంచెం సేపే ఉన్నట్లుంటుంది. ఆనందం క్షణికం అంటారు. అయినా అవి జరగకపోతే బాధ, దుఃఖం, కష్టం, కన్నీళ్ళతో క్రుంగుతాం. మనం పడిన కష్టం అంతా దండగ అయిందని బాధపడతాం. అన్నం తినబుద్ధికాదు, నిద్రపట్టదు. అన్నీ పోగొట్టుకున్నట్లు బాధ. కష్టాలు కలకాలం ఉన్న భావన కలుగుతుంది. కొన్నాళ్ళకు మళ్ళీ ఇంకో ఆశమొదలు. ఆశలకు అంతులేదు, నిరాశలకు అంతంలేదు. చిన్నపిల్లలకు చిన్న చిన్న ఆశలు, పెద్దవాళ్ళకు పెద్ద పెద్ద ఆశలు. ఇలా జీవితం సాగుతూనే ఉంటుంది.

పుట్టీ పుట్టగానే ఏడుపుతో మన జీవితం మొదలవుతుంది. మనం ఏడుస్తుంటాం కాని మనచుట్టూ ఉన్న మనవాళ్ళు పిల్ల పుట్టిందని సంతోషిస్తుంటారు.

చివరికి కన్నుమూస్తే ప్రపంచంలో దేనితో మనకు సంబంధం ఉండదు. ఏదీ అక్కర లేదు. చనిపోయిన శరీరం నిశ్చలం. మనం కదలం కాని చుట్టూ ఉన్న వాళ్ళను కదిలిస్తాం. మనం మరణించి నందుకు మనవాళ్ళందరికీ ఏడుపు.

అయితే ఆ సంతోషం, ఈ దుఃఖం కూడా రోజు రోజుకూ తగ్గుతుంటాయి. అదే మాయ. మాయలోపడి క్రమంగా మరిచిపోతాం తిరిగి ఇంకో కొత్త ఆనందం కోసం ఎదురు చూస్తుంటాం. వెలుగునీడలలాంటిది జీవితం.

ఇలాసాగే జీవితంలో ఒక్కొక్కసారి ఏంచేయాలో తెలీదు. ఎటువెళ్ళాలో తెలీదు. ఏది శాశ్వతం? ఎవరు మనవాళ్ళు? ఎవరు పరాయివాళ్ళు? అన్నీ సందేహాలు ఇలా అయోమయంలో ఉంటాం. ఇదిగో ఇలాటప్పుడే భగవంతుడు గుర్తువస్తాడు. సాక్షాత్తు భగవంతుడు చేసిన హితోపదేశమే భగవద్గీత.

ఎటు నడవాలో చూపుతుంది
ఎలా నడవాలో చెపుతుంది
ఎందుకు నడవాలో తెలుపుతుంది
సందేహాలకు సమాధానాలిస్తుంది
సంతోషానికి మార్గం చూపిస్తుంది
సంతృప్తికి బోధ చేస్తుంది............ అదే భగవద్గీత.

మరి ఆ మహోపదేశాన్ని భగవంతుడి బోధను కొంచెం తెలుసుకుందామా...

(ఇంకావుంది.)

# తృప్తి

రామయ్య చిన్నప్పటినుండి నదీస్నానం చేయాలని కోరుకుంటూ ఉండేవాడు. ఒకసారి అతడు తన ఊరి వాళ్ళతో కలిసి గోదావరి నదికి వెళ్ళాడు. గోదావరిలో స్నానం చేస్తున్నాడు రామయ్య. ఎక్కడినుంచో ఒక బంగారు పిడి ఉన్న ఒక చేతికర్ర నీళ్ళలో కొట్టుకుని వచ్చింది. రామయ్య సంతోషంతో దానిని తీసుకున్నాడు. ఆ కర్ర పట్టుకుని మురిసిపోయాడు. స్నానం పూర్తిచేసివచ్చి తీసుకుందామని గట్టుమీద పెట్టాడు. 'ఓం నమఃశివాయ' అని మూడుసార్లు మునిగి స్నానం పూర్తిచేశాడు. ఆశగా గట్టు దగ్గరకు వచ్చాడు. గట్టుకొంచెం పల్లంగా ఉంది. అందుకని ఆ కర్ర కాస్తా నది నీళ్ళలో కొట్టుకునిపోయింది. ఆశగా వచ్చి కర్రకోసం చూసిన రామయ్యకు ఆ కర్ర నదిలో కొట్టుకుని పోతూ కనిపించింది. "అయ్యో ! అయ్యో ! నాకర్ర, నాకర్ర బంగారు పిడిఉన్న నా చేతికర్ర!" అని నెత్తినోరు బాదుకుంటూ ఏడవడం మొదలు పెట్టాడు.

చూశారా ! ఆ కర్ర రామయ్యదా ? దాన్నేమయినా తనతోపాటు తెచ్చుకున్నాడా? నదిలో దొరికింది మళ్ళీ నదిలోకి పోయింది. పోనీలే బంగారు పిడి ఉన్న కర్ర కొంచెం సేపు నాచేతిలో ఉందికదా అని అనుకుంటే ఎంత శాంతిగా ఉండేది. ఎంత తృప్తిగా ఉండేది. తనదికాని వస్తువు కోసం బాధపడి నెత్తి నోరు కొట్టుకుంటే దుఃఖమే కదా !

# సత్యవ్రతుడు



ఒక ఊరిలో ఒక మహనీయుడు మంచి విషయాల గురించి ఉపన్యాసాలు చెప్ప సాగాడు. ఒక దొంగ రోజూ ఆ ఉపన్యాసాలు వినేవాడు. క్రమంగా అతడికి మంచి మనిషిగా మారాలనిపించింది. ఆ దొంగ ఆ మహాత్ముడి దగ్గరకు వెళ్ళి "స్వామి! నన్ను మీ శిష్యుడిగా గ్రహించండి" అని కోరాడు. ఆయన "నువ్వు ఏమిపని చేస్తుంటావు'' అని అడిగాడు. దొంగ "నేను పగలంతా పేకాట, జూదం ఆడుతుంటాను, రాత్రి దొంగతనం చేస్తుంటాను రోజంతా అబద్ధాలు చెప్తుంటాను" అని అన్నాడు. "అన్ని చెడ్డగుణాలు వున్న నిన్ను నేను శిష్యుడిగా తీసుకోను" అన్నాడు స్వామిజీ. దొంగ బ్రతిమలాడసాగాడు. అప్పుడు జాలిపడి "సరే నువ్వు కనీసం ఏదయినా ఒక్క చెడ్డ గుణాన్నయినా వదలుకో" అన్నాడు గురువు.

దొంగ ఆలోచించాడు. దొంగతనం చేయకపోతే ధనం ఉండదు. ఎలా జీవించాలి? కనుక దొంగతనం వదులుకోలేను అనుకున్నాడు. ఇక పేకాట అది లేకపోతే కాలక్షేపం ఉండదు. ఎలా? అబద్ధాలు చెప్పడం మానేస్తే ఎలా ఉంటుంది?... దీనివల్ల పెద్ద నష్టం కనబడలేదు. సరేలే అనుకుని "నేను ఇక అసత్యం పలుకను" అని మాటిచ్చాడు.

ఆ మహాత్ముడు "నేను ఒక సంవత్సరం తరువాత వస్తాను అప్పటిదాకా అబద్ధాలు చెప్పకుండా నీమాట నిలబెట్టుకుంటే నిన్ను శిష్యుడిని చేసుకుంటాను" అని అన్నాడు.

ఆ రోజు రాత్రి దొంగ రాజుగారి భవనంలో దొంగతనానికి వెళ్ళాడు. నిద్రపట్టక బయటకు వచ్చిన రాజు దొంగను చూసి "ఎవరు నువ్వు" అన్నాడు. దొంగ అబద్ధాలు మానేశాడు కదా ! "నేను దొంగను" అన్నాడు. రాజుకు అనుమానం వచ్చింది. తమాషా చేద్దామని "నేను కూడా దొంగనే మనిద్దరం దొంగతనం చేసి రాజుగారి ధనం చెరిసగం పంచుకుందాం" అన్నాడు. రాజును ఎప్పుడూ చూడని దొంగ 'సరే' అన్నాడు. రాజు కబుర్లుచెప్తూ దొంగ ఎక్కడ ఉంటాడో అన్ని వివరాలూ అడిగాడు. అన్నీ నిజాలు చెప్పాడు దొంగ. ఇద్దరు ఖజానాలో సొమ్ము మూటలు

కట్టారు. ఇనపపెట్టెలో మూడు వజ్రాలు కనిపించాయి. ఇద్దరూ చెరొకటి తీసుకుని ఒకటి "పాపం రాజుకు ఉండనీ" అని దానిలోనే ఉంచేశారు.

మర్నాడు భటులు వచ్చి రాజుగారితో ఖజానాలో దొంగతనం జరిగిందని చెప్పారు. రాజు మంత్రిని "ఏమేమి పోయాయో చూసివచ్చి చెప్పు"మన్నాడు. మంత్రికి పెట్టెలో ఒక వజ్రం కనిపించింది. ఎలాగూ అన్నీ పోయాయి కదా అని ఆ వజ్రం ఎవరూ చూడకుండా తీసి తన జేబులో వేసుకున్నాడు. మంత్రి వచ్చి "ప్రభూ! విలువైన వజ్రాలతో సహా అన్నీ పోయాయి" అని చెప్పాడు.

రాజు దొంగను సభకు పిలిపించాడు. దొంగతనం గురించి అడిగాడు. రాజును గుర్తు పట్టని దొంగ రాజుతో "ప్రభూ నాతోపాటు ఇంకొక దొంగకూడా వచ్చాడు. మేము వజ్రాలు చెరొకటి తీసుకుని ఒకటి అక్కడే ఉంచాము" అన్నాడు. రాజు మంత్రిని సోదా చేయించాడు. వజ్రం బయటపడింది. వెంటనే అతడిని మంత్రి పదవినుంచి తొలగించాడు. అంతానిజమే చెప్పిన సత్యవ్రతుడైన దొంగను మంత్రిగా నియమించాడు రాజు.

మంత్రి అయిన సత్యవ్రతుడికి ఇప్పుడు దొంగతనం చేసే అవసరమే లేదు. మంత్రి పదవి బాధ్యతలతో జూదం, పేకాట అడేతీరికే లేదు. దానితో దొంగతనం, పేకాట అనే చెడ్డ గుణాలు అవేపోయాయి.

ఒక సంవత్సరం తరువాత పూర్వపు మహనీయుడు ఆ ఊరికి తిరిగివచ్చాడు. సత్యవ్రతుడు ఆయనకు నమస్కరించి ఒక్క మంచిగుణం వల్ల ఎలా మంత్రిగా మారిపోయాడో చెప్పాడు. చెడ్డగుణాలు పోగొట్టుకోవడం ఎంతమంచిదో అందరికీ తెలిసింది. మంచి మనిషిగా మారితే చాలనుకున్నవాడు మంత్రి అయ్యాడు.

అబద్ధాలు చెప్పడం, దొంగతనం, పేకాట మానేసి సత్యవ్రతుడు ఎంతగొప్పవాడయ్యాడో చూశారా. కనుక మనం మనలోని చెడ్డ అలవాట్లను వదిలివేయాలి.

*సత్య అంటే ఋగ్వేదం*
*స - అంటే సామవేదం*
*అ - అంటే అధర్వణవేదం*
*య - అంటే యజుర్వేదం*
*సత్యం సర్వవేద స్వరూపం. సత్యమే దైవం.*
*సత్యమే సర్వులను రక్షించెడి సర్వేశ్వరుడు.*

# పల్లెసీమలు - పిల్లగాలులు

ఒకనాడు, పుట్టపర్తి కుగ్రామం. ఈనాడు దాదాపు 167 దేశాలనుంచి వచ్చిపోయే ప్రతినిధులతో, భక్తులతో కళ కళలాడుతూ, కిట కిటలాడుతూ ఉండే ప్రదేశం. ఒకనాడు మారుమూల ఉండేది. ఈనాడు ప్రపంచపటంలో ప్రముఖస్థానం పొందింది. అంతర్జాతీయ ఖ్యాతిపొందిన వైద్యాలయం, అందరి మన్ననలు పొందిన విశ్వవిద్యాలయం, పల్లెలకు ఊపిరినందించే నీటి పారుదల ప్రాజెక్టులు పుట్టపర్తిని ఆధ్యాత్మిక రంగంగా కళా రంగస్థలంగా మానవత్వపు నిలయంగా మార్చాయి.

ఈనాటి పల్లె రేపటి పట్నం కావచ్చు. పల్లెలు భారతీయ సంస్కృతికి సంప్రదాయానికి ఇంకా పట్టుకొమ్మలుగానే ఉన్నాయి. అవికూడా అడుగంటిపోకుండా పల్లెల్లో చైతన్యం వెల్లి విరిసేలా చేయడానికి కంకణం కట్టుకున్నాయి శ్రీ సత్యసాయిసేవాసంస్థలు.

గ్రామసేవే రామసేవ అనే నినాదంతో ఊరూరా తమ సేవలను అందించడానికి మారుమూల గ్రామాలకు ఉరుకులు తీస్తున్నాయి శ్రీ సత్యసాయిసేవాసంస్థలు.

'గ్రామసేవ బినా నిర్వాణ నహీ' అన్న స్వామి మాటకు స్పందించి సేవయే దీక్షగా పూనుకున్నాయి ఈ సంస్థలు.

గ్రామసేవలో భాగంగా 'బాలవికాస్' విభాగాన్ని గ్రామ పిల్లలకు పరిచయం చేస్తూ లేత వయసులోని ఆ పసిమొగ్గలను పసిడి పువ్వులుగా మార్చడానికి మార్గం వేస్తున్నారు. బాలవికాస్ గురువులు.

పిల్లలలో ఉరకలు వేసే ఉత్సాహం, పిల్లల మనస్తత్వం గల పెద్దల్లో ఆనందం వర్ణనాతీతం. ఆధ్యాత్మిక ఆరోగ్య వైద్య, విద్యా రంగాలన్నిటిలో పల్లె ప్రజలలో అవగాహన కలిగించడానికి కార్యకర్తలు చేసే కృషి ప్రశంసనీయం. మరి ఆ గ్రామసేవ కార్యక్రమం చూద్దాం రండి.

## గ్రామసేవే రామసేవ

### ఒక అనుభవం:

దైవాన్ని సమాజరూపంలో దర్శించి సేవించమన్నారు స్వామి. సేవ సంస్కార సాధనమన్నారు. సేవా కార్యక్రమాలలో గ్రామసేవ ఒక ఆధ్యాత్మిక సాధనగా ఆచరిస్తున్నాము. గ్రామసేవలో భాగంగా బాలవికాస్ గ్రామపిల్లలకు పరిచయం చేస్తాము. పిల్లలతో, స్వామికి ప్రేమయే ప్రాణమని చెప్తూ

సేవను ఇచ్చుకోవాలి, ప్రేమను పుచ్చుకోవాలి అని స్వామి చెప్తారని చెప్తాము. గ్రామాలలో పిల్లలకు విద్యాసౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అధ్యాత్మికవిద్య కూడా తక్కువే. సత్యమును పలకాలి, ధర్మమును అనుసరించాలి, జ్ఞానమును అభివృద్ధిపరచుకోవాలి, ప్రేమను పెంపొందించుకోవాలి, చెడ్డ పనులు మానాలి, పెద్దలయందు వినయవిధేయతలు చూపించాలి అని పవిత్రమైన సూక్తులను పిల్లల హృదయాలలో నాటడానికి ప్రయత్నిస్తాము. దానితో పాటు ఆరోగ్యము, పరిశుభ్రత గూర్చి కూడా చెప్తాము.

మేము చేసిన గ్రామసేవలో జూలై 7,8 తేదీలలో క్రిందటి ఏడాది లింగంపల్లి గ్రామానికి వెళ్ళాము. రంగారెడ్డి జిల్లా నవాబుపేట మండలంలోది లింగంపల్లి గ్రామం. అక్కడ స్కూలు 7వ తరగతి వరకూ ఉంది. ఆ ఊరి పిల్లలందరికీ 'బాలవికాస్' తీసుకున్నాము. వారిలో మార్పుతెచ్చే ప్రయత్నంలో వాళ్ళకు మానవతా విలువల గురించి చెప్పాము. స్వామి ఆదర్శాలను సేవా కార్యక్రమాలను గురించి చెప్పాము. స్వామి ఆదర్శాలను సేవా కార్యక్రమాలు గురించి చెప్పాము. స్వామి టి.వి. అంటే టెలివిజన్ కాదు 'టెలివిషం' అన్నారు. కాబట్టి టి.వి.లు చూడవద్దు అని చెప్పాము. ఆరోగ్య సూత్రాలను చెప్తూ డాక్టరుగారు 'టెలివిషం', 'తెలివి విషం' గురించి కూడా చెప్పారు.

మేము ఆ రోజు తిరిగివచ్చాము కాని మేము నాటిన బీజాలు మొలకెత్తాయి. చిరంజీవి ఆనందం అనే పిల్లవాడు బాలవికాస్‌లో నేర్చుకున్నవి మరచిపోలేదని, ముఖ్యంగా టి.వి. చూడటం మానేశానని ఉత్తరం రాశాడు. నిజంగా స్వామికోరిన మార్పు ఇలా కొంచెం అయినా కనబడినందుకు మాకు సంతోషం కలిగింది. ఆ ఉత్తరం ఒకసారి బెంగళూరు తీసుకువెళ్ళగా మా జోనల్ ఇన్‌చార్జి దగ్గరనుంచి స్వామి ఆ ఉత్తరం తీసుకున్నారు. ఇది మాకు ఇంకా సంతోషం కలిగించింది. స్వామి ఆ చిన్నారిని ఆశీర్వదించినట్లు భావిస్తున్నాము. (ఇలాంటి మార్పులు చాలారావాలని వచ్చిన మార్పులు నిలబడాలని ఆశిస్తూ) ఇక్కడ దాని జెరాక్స్ కాపీని ప్రచురిస్తున్నాము.





SAVITRI (Sai Ram)
A1-201, R.K. TOWERS
MAYURI MARG, Begumpet
HYDERABAD - 16
500016

# స్వామితో నా అనుభవం

- శ్రీమతి లలితమ్మ

ఇది యీనాటి మాటకాదు. దాదాపు 38 సంవత్సరముల క్రిందటి విషయం. స్వామి నాకు స్ఫటిక జపమాల సృష్టించి ఇచ్చి, మంత్రోపదేశం కూడా చేశారు. తర్వాత హైద్రాబాదుకు వచ్చిన తరువాత రోజూ తెల్లవారు జామునే లేచి జపం చేసికునేదాన్ని. కొన్ని రోజులకే, మాకేదో చిన్న నష్టం బిజినెస్‌లో వచ్చింది. మళ్లీ పర్తికి వెళ్లినప్పుడు నా అమాయకత్వమో, అజ్ఞానమో కాని స్వామితో అన్నాను. "స్వామీ ఈ జపమాల వచ్చినాక కష్టం వచ్చింది" అని. "అయితే తే!" అని స్వామి అన్నారు. మళ్లీ ఇచ్చేందుకు భయమేసింది. ఇవ్వాలనిపించలేదు. వారం రోజులు పర్తిలో ఉండిన తర్వాత హైద్రాబాద్‌కు బయలు దేరాము నేను, పిల్లలు. అప్పుడు మావారు జాబ్‌లో ఉన్నారు కనుక తరుచుగా రాలేకపోయేవారు. తెల్లవారు జామున ట్రైన్‌లో లేచి జపం చేసికోవాలని చూశాను. ఆశ్చర్యం! జపమాల పెట్టినవానితోపాటే ఇంకా పాపవినగలు నాచీరెలు అన్నీపోయినవి. ఏదో చిన్న స్టేషన్‌లో రైలు ఆగిఉంది. 5 నిమిషాలు అగుతుందా అని పోర్టరునడిగాను. ఆగుతుందన్నాడు. దిగి అన్నీ పోయిన విషయం స్టేషన్ మాష్టరుకు చెప్పాను. ఆ పూట ఉండి కంప్లెయింట్ రాసివ్వమన్నారు. పిల్లలున్నారు ఉండలేనన్నాను. అప్పుడు ఒక రైల్వే పోలీసాఫీసరు మాతో వచ్చి బోగీలోనే కంప్లెయింటు వ్రాసుకున్నారు. మేము హైద్రాబాదుకు వచ్చేశాము. తర్వాత రెండు రోజులకే ఆ అఫీసర్ వచ్చి మీ నగలు దొరికాయి గుర్తు చూసుకోండి అన్నాడు. ఆరోజు పర్తినుండి స్వామి మాయింటికొస్తున్నారు. ఇంట్లో చాలా పనుల వత్తిడిలో హడావిడిగా ఉన్నాను. కాని ఇదికూడా ముఖ్యమే కదా! అన్ని ఏర్పాట్లు చేసి మావారిని ఇంట్లో ఉంచి నేను వెళ్లి నా నగలు గుర్తించి తెచ్చుకున్నాను. అన్నీ దొరికాయి కాని జపమాల మాత్రం దొరుకలేదు. స్వామితో చెప్తే "నీవొద్దన్నావు కదా అందుకే అది నాదగ్గరకొచ్చింది" అన్నారు. తర్వాత కూడా చిన్న రుద్రాక్షమాల ఇచ్చారు. కాని ఈ సంస్థపనుల్లోపడి సరీగ్గా జపం చేసుకోలేక పోయాను. ఎలా పోయిందో గుర్తులేదు కాని అదీ పోయింది. మళ్లీ అయిదారు సంవత్సరాల క్రిందట పుట్టపర్తి వెళ్ళినప్పుడు స్వామితో చెప్పితే "ఇప్పుడు నీకు అది అవసరం లేదు" అని అన్నారు. మనకేది ఎప్పుడు అవసరమో అన్నీ వారికే తెలుసును.

# మీ పేజి

## సాయి దర్శనం

ఇ. పద్మావతి, కన్యాగురుకుల్ స్కూల్
హైదరాబాదు.

నేను 7వ తరగతి చదువుతున్నపుడు మాస్కూలులో మాకు బాలవికాస్ చెప్పడానికి ఒక టీచరు వచ్చేవారు. మేము ఆవిడని 'పద్యాల టీచర్' అని పిలిచేవాళ్ళం. తరువాత నేను వాళ్ళ ఇంటికి బాలవికాస్ నేర్చుకోవడానికి వెళ్ళేదాన్ని. బాలవికాస్‌కు వెళ్ళడంవల్ల నాకు ఎంతో ఆనందం కలుగుతుంది. మంచి, చెడు తెలుసుకుంటున్నాను. కోపము, అబద్ధాలు చెప్పడం తగ్గించుకున్నాను.

ఒకరోజు మా బాలవికాస్ పిల్లలను మా టీచరుగారు సఫిల్‌గూడ తీసుకువెళ్ళారు. అక్కడ ఒక అంకుల్ గారింట్లో ఎన్నో ఫోటోలనిండా విభూతి ఉంది. ఒక పెద్ద ఫోటోలో షిరిడి సాయిబాబా ఆకారంలో విభూతి ఉంది. అది అసలు సత్యసాయిబాబా ఫోటో. ఒక ఫోటోలో విష్ణువు ఆకారంలో, ఒకదానిలో 'ఓం' ఆకారంలో విభూతి ఉంది. లోపల పూజగదిలో షిరిడిబాబా సత్యసాయిబాబా ఫోటోలనుంచి కుప్పలు కుప్పలు కుంకుమ పసుపు వచ్చాయి.

మాకు భలే ఆశ్చర్యం వేసింది. నాకు సత్యసాయిబాబాను చూడాలని ఉంది. పుట్టపర్తి వెళ్ళాలని ఉంది. ఏమో... ఎప్పుడు వెళ్తానో! .......

పొద్దు గూకింది బాలవికాస్ బుక్ చదువుతూ పడుకున్నాను. స్వామి శివం వచ్చారుట మేమంతా గురువుగారి కారులోనే శివంకి వెళ్ళాము. అక్కడ ఇసకవేస్తే రాలకుండా భక్తులు ఉన్నారు. నాకు ఇలా అనిపించింది. ఇంతమంది ఎన్ని సేవలు చేశారో వీళ్ళకు బాబా గురించి ఎంత తెలుసో నేను అసలు బాబాని చూడనేలేదు వీళ్ళు చేసినంత నేను చెయ్యలేదు కదా... నాతోటి వాళ్ళు గుడి గోడలసందులలోనుంచి తలలు దూర్చి తొంగి చూస్తున్నారు. జనం తోసేస్తున్నారు. కాళ్ళు నొప్పిపుడుతున్నాయి. నాకు బాబా తల ఒక్కటే దూరం నుంచి కనిపించింది.

ఇంతలో రోడ్డు పక్కన చిన్న ఇళ్ళల్లో స్వామి ఉన్నారని తెలిసింది. నాకు ఆరు నెలల పరీక్షలు అవుతున్నాయి. అక్కడకు దగ్గర ఉన్న ఇంటి దగ్గరకు వెళ్ళాము. బాబాగారు ఒక్కరే కూర్చుని ఉన్నారు. నన్నుచూసి "ఈమధ్య బాలవికాస్‌కు ఎందుకు రావడంలేదు" అన్నారు. నన్ను బాబా ఎప్పుడూ చూడలేదు కదా ఎలా మాట్లాడారు? అనుమానంగానే "మరి నాపరీక్షలు ఎట్లా?" అన్నాను. "రోజూవచ్చి నాదగ్గర నేర్చుకో నేను చెప్తాను" అన్నారు.

సాయంత్రం వేళలో నాలుగు గుఱ్ఱాల రథంలో స్వామి మా ఇంటికి పదిఅడుగుల దూరంలో కనిపించారు. అప్పుడు అంత జనంలో శివం వరకు వెళ్ళి తోసుకుంటూ చూస్తే తల తప్ప ఏమీ కనపడలేదు. ఇప్పుడు రంగురంగుల పూలతో అలంకరించిన రథంపై మాఇంటికి ఎదురుగా

నిలబడి స్వామి నన్నే చూడడం నాకెంతగానో ఆనందం కలిగించింది. గుమ్మంలో నిలబడిన దాన్ని బాబా దగ్గరకు పరుగెత్తుకుపోతున్నాను.......

కాళ్ళకు ఎవరో మనిషి అడ్డం తగిలారు. ఆలస్యం అయితే స్వామి వెళ్ళిపోతారేమో ఛీ! ఛీ! అని విసుక్కుంటూ కాళ్ళ దగ్గర మనిషిని జరగమనడానికి చూశాను. మా తమ్ముడు, నా చెల్లెలు నాకాళ్ళ దగ్గర అడ్డంగా పడి నిద్దరపోతున్నారు. ఆ ఇదంతా కలా... బాబా కనపడలేదా? మాట్లాడలేదా ? నిరాశగా లేచాను. స్వామిని ఎప్పుడు చూస్తానో!.............

# పేరులోనే సందేశము

*శ్రీమతి స్వయంప్రభ.*

**శ్రీ**ల కన్న శీలం మిన్న

**స**మత్వం వివేకానికి గుర్తు

**త్య**జించుము దుర్గుణములను

**సా**ధకునకు వేదన పనికిరాదు

**యి**తర మతములను ద్వేషించకు

**బా**ధ గురువులు కాదు బోధ గురువులు కావాలి

**బా**హ్య ప్రియుడు కాదు భగవంతుడు భావప్రియుడు.

---

**జవాబులు :-**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రా | మ | | | | | |
| శ్రీ | రా | మ | | | | |
| దా | శ | ర | థి | | | |
| ర | ఘు | రా | ము | డు | | |
| కో | దం | డ | రా | ము | డు | |
| ద | శ | ర | థ | రా | ము | డు |

"రామదాసు అనేక కష్టములకు గురిఅయినాడు. జైలులో పెట్టినారు. కొరడాలతో కొట్టినారు. కానీ ఈలాంటి పరిస్థితిలో కూడా రామునిపై భక్తిని వదలలేదు. ఆ బాధలలోకూడా రామదాసు ప్రీతితో, వినయ విధేయతలతో "రామా! నీదయరాదా! అని అతి దీనంగా ప్రార్థించాడు. అటువంటి భక్తితో ఏనాడు మనము ప్రేమ తత్త్వాన్ని పదిమందికి పంచుటకు ప్రయత్నిస్తామో, అదే నిజమైన రామరాజ్యము. మనలో ప్రేమతత్వాన్ని పెంచుకుని, సత్య మార్గములో ప్రవర్తిస్తూ ఏనాడు మన జీవితాన్ని రామతత్త్వంగా మార్చుకొనుటకు ప్రయత్నిస్తామో ఆ రోజే శ్రీరామనవమి."

– బాబా